క్లుప్తంగా

చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని నెహ్రూ చౌక్ నుంచి భాగ్యనగర్‌కు వెళ్లే దారిలో ఎక్కడబడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బందికి గురిచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం, భాగ్యనగర్ కాలనీవాసులు అన్నారు. శనివారం టూటౌన్ ఎస్సైకు ఫిర్యాదు చేశారు. భాగ్యనగర్, తాటిగూడ కాలనీవాసులు మార్కెట్ యార్డు గుండా వెళ్తారని, ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లపైనే దుకాణాలను ఏర్పాటు చేయడం, దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆ దుకాణాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు గంట సురేశ్, దశరథ్, సురేశ్‌గౌడ్, సుధాకర్, లక్ష్మణ్, రమేశ్, నితిన్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఇచ్చోడ: మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ఎన్‌సీసీ క్యాంప్‌లో ప్రతిభ కనబరిచి, ఓవరల్ ఛాంపియన్‌షిప్‌గా ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ క్యాంపులో గురుకుల విద్యార్థులు 24 మెడల్స్ సాధించారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్సీవో అగస్టీన్, ప్రిన్సిపాల్ గోవర్ధన్‌లు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భోజన్న, శ్రీవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు బాధ్యతయుతంగా పని చేయాలని రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఇటీవల వన్యప్రాణి సంరక్షణ బోర్డు సభ్యుడిగా ఎన్నికైన ఆయనను శనివారం బీర్సాయిపేట రేంజ్ అటవీశాఖ అధికారులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. పలు విషయాలపై చర్చించారు. సన్మానించిన వారిలో బీర్సాయిపేట ఎఫ్‌ఆర్‌వో అరుణ, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో అనిత, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

తాంసి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో చిన్నారులకు శనివారం ఏకరూప దుస్తులు అందజేశారు. ప్రభుత్వం తరఫున చిన్నారులకు మంజూరైన దుస్తులను అంగన్‌వాడీ కేంద్రంలో మండల ఎంఈవో శ్రీకాంత్ అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు సరితా రెడ్డి, రూప, విజయలక్ష్మి ఉన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన ఇస్తారి అనారోగ్యంతో గత కొద్ది రోజులుగా బాధపడుతున్నాడు. శనివారం హమాలీ కార్మిక సంఘం నాయకులు సిరిసిల్ల భూమయ్య, దుబాక సుభాష్, రమేశ్, కాశిపాక విష్ణులు రూ. 5 వేల నగదు అందచేశారు.

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన పవార్ ప్రవీణ్‌కి సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి శనివారం ఆర్థిక సాయం అందజేశాడు. రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్ రెండు కాళ్లు విరిగిపోవడంతో వడ్డాడి గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించి రూ.5వేలు అందజేశాడు. గ్రామస్తులు శ్రీకాంత్, నాందేవ్, దినేశ్ రెడ్డి, శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

బజార్‌హత్నూర్: మన కుటుంబంలో తల్లి, చెల్లి, భార్యను గౌరవించినట్లే సమాజంలో ఇతర మహిళలను గౌరవించాలని ఆదిలాబాద్ సఖీ సెంటర్ కౌన్సిలర్ నాగమణి అన్నారు. శనివారం మండలంలోని హర్కాయి, భీమ్లానాయక్‌తండా, మంజరంతండా, ధరంపురి గ్రామాల్లో ఈనెల 10న మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళలకు సమానత్వం, స్వేచ్ఛ, సంరక్షణ, గౌరవం కల్పించాలన్నారు. మహిళలు, యువతులు అత్యవసర సమయంలో 181, 1098, 1930 హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సుకేష్, అంగన్‌వాడీ టీచర్లు సోనుబాయి, శిల్పా, పుష్పలత, గ్రామపటేళ్లు, మహిళలు పాల్గొన్నారు.

అహల్యాబాయి కృషి మరవలేనిది

ఆదిలాబాద్‌టౌన్: మహిళల సాధికారతకు అహల్యాబాయి కృషి మరువలేనిదని సామాజిక సమరసత వేదిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. అహల్యబాయి హోల్కర్ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని వివేకానంద బీఎడ్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పుస్తక, కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహల్య బాయి హోల్కర్ 300 సంవత్సరాల క్రితమే మహిళల సాధికారత కోసం ఆలోచించారని, సాంఘిక దురాచారాల మీద గళం విప్పిందన్నారు. రైతులు, చేనేత వృత్తి వారితో పాటు అన్నిరంగాల వారి మన్ననలు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు సల్ల విజయబాబు, కళాశాల ప్రిన్సిపాల్ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన పొగమంచు

ఆదిలాబాద్‌రూరల్: పొగమంచు రోడ్డును కమ్మేసింది. శనివారం ఉదయం 7 గంటల సమయంలో మండలంలోని చాందా (టి), బేల్లూరి శివారు ప్రాంతంలో పొగమంచు కారణంగా రోడ్డు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.



గ్రామస్థాయి సీఎం కప్ పోటీలు ప్రారంభం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రామస్థాయి సీఎం కప్ పోటీలను ఎంఈవో శ్యాంసుందర్ ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డితో కలిసి క్రీడకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. గ్రామస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండలస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని ఎంఈవో శ్యాంసుందర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రంజన, ఉపాధ్యాయులు మహేందర్, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శనివారం సీఎం కప్ క్రీడ పోటీలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో


వాలీబాల్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

వాలీబాల్, రన్నింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మండలస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

నేరడిగొండ: పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని నూతనంగా ఎన్నికైన నాయకులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో


ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

యూత్ కాంగ్రెస్ నాయకులు బద్దం పోతారెడ్డి, క్రాంతికిరణ్, నాయిడి రవి, పాల శంకర్, కుంట శంకర్, సతీష్, రమేశ్ పాల్గొన్నారు.

112 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

తాంసి: స్థానిక సంస్థల ఎన్నికలకు మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు పోలింగ్ కేంద్రాలను గుర్తింపు పూర్తి చేసినట్లు ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలో ఆయా పంచాయతీలో మొత్తం 112 పోలింగ్ కేంద్రాలను వార్డులతో పాటు ఓటర్ల ఆధారంగా గుర్తించారు. గుర్తించిన పోలింగ్ కేంద్రాల వివరాలను ఆయా పంచాయతీలతో పాటు మండల కేంద్రంలోని కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ లిస్ట్‌ను నోటీస్ బోర్డుపై శనివారం ఏర్పాటు చేశారు. ఎంపీవో లింగయ్య, సూపరింటెండెంట్ రాధ, ఈసీ గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

తుది పోలింగ్ బూత్‌ల జాబితా ప్రదర్శన

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై శనివారం గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా తుది పోలింగ్ బూత్‌ల జాబితాను ఎంపీడీవో మహేందర్


పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

కుమార్, ఎంపీవో వినోద్‌కుమార్‌లు ప్రదర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 37 గ్రామ పంచాయతీలకు ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రం ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వార్డుల వారీగా మొత్తంగా 302 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జమీల్ హైమద్, జూనియర్ అసిస్టెంట్ శశికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉపాధి ప్రజావేదిక

గుడిహత్నూర్: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన జాతీయ ఉపాధిహామీ పనులకుగాను సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనులు, చెల్లింపులపై సామాజిక తనిఖీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించి, శనివారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ప్రజావేదిక నిర్వహించారు. తనిఖీ నివేదికలను, అవకతవకలను అధికారులకు వివరించారు. ప్రతీ పంచాయతీలోను అక్కడక్కడ అవకతవకలు జరిగినట్లు బృంద సభ్యులు తెలిపారు. ఏ మేరకు నిధులు దుర్వినియోగం అయ్యాయో ఇప్పుడే చెప్పలేమని ఆదివారం నాటికి పూర్తి సమాచారం అందిస్తామన్నారు. ఏపీడీ కుటుంబరావ్ ప్రతీ అంశాన్ని


ప్రజావేదికలో వివరాలు నివేదిస్తున్న సిబ్బంది

క్షుణ్ణంగా పరిశీలించి విధుల పట్ల నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ విజిలెన్స్ అధికారి రాజేశ్వర్, ఎంపీడీవో అబ్దుల్‌హై, ఏపీడీ కృష్ణారావ్, అంబుడ్స్‌మన్ మీనా, ఏపీవో శామ్యూల్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం


కురుస్తున్న వర్షం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఈశ్వర్ నగర్, వాగాయితండా, ఏమాయికుంట, హీరపూర్, సమా క, కేస్లాగూడ గ్రామాల్లో శనివారం భారీ వర్షం కు రిసింది. భారీ వర్షానికి చేతికొచ్చిన పత్తి తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురవడంతో యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, శనగ, గోదుమ పంటలతో పాటు కాత, పూత దశలో ఉన్న కంది పంటలకు జీవం పోసినట్టైందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎంను కలిసిన సాయిచరణ్ గౌడ్


సీఎం రేవంత్ రెడ్డితో సాయిచరణ్ గౌడ్

కైలాస్‌నగర్: యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి ఆధ్వర్యంలో సీఎంను హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. కష్టపడి పని చేయండి పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా నిచ్చినట్లుగా ఆయన తెలిపారు.

ఆటోల బంద్ వాయిదా


నినాదాలు చేస్తున్న నాయకులు

ఎదులాపురం: జిల్లా ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే ఆటోల బంద్‌ను వాయిదా వేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఠాకూర్ హోటల్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి, ఈనెల 10న కార్మికులతో సమావేశమై సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో బంద్ వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జగన్ సింగ్, దళిత్, వెంకట్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గోమాత భారతీయ సంస్కృతికి ప్రతీక

ఆదిలాబాద్: గోమాత భారతీయ సంంస్కృతికి ప్రతీక అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గోవులను సంరక్షించాలని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపడుతున్న బాలకృష్ణ స్వామి శనివారం జిల్లా కేంద్రానికి చేరుకోగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. గోపాలకృష్ణ మఠంలో గోమాతకు పూజలు చేసి, బాలకృష్ణ స్వామిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోమాతను రక్షించుకుంటే మనల్ని మనం రక్షించుకున్నట్టేనని పేర్కొన్నారు. గోమాతలు దైవ స్వరూపాలని, వాటి పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరామచంద్ర గోపాలకృష్ణ, మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, అప్పాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

నేరడిగొండ: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. శనివారం రిమ్స్ ఆస్పత్రిలో కలిసి శాలువాతో సత్కరించారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా నాయకులు పసుల చంటి, బద్దం పోతారెడ్డి, కుర్మె మహేందర్, నాయిడి రవి, పాల శంకర్ పాల్గొన్నారు.

నార్నూర్: మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన వంశీకిరణ్‌ను శనివారం శ్రీ సాయి గోసేవ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఆడే రాంనివాస్, గజేందర్‌లు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీకి చెందిన వంశీకిరణ్ కష్టపడి చదివి డాక్టర్ కావడం ఆనందంగా ఉందన్నారు. రైతులకు అందుబాటులో ఉండి పశువులకు వైద్యం అందించాలని సూచించారు.

పరామర్శ

కైలాస్‌నగర్: అనారోగ్యంతో మృతి చెందిన వాంకిడి ఎంపీడీవో ప్రబుదయ అంత్యక్రియలను కుటుంబీకులు శనివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి ప్రబుదయ పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ మావల మండల అధ్యక్షుడు శేఖర్, నవీన్ రెడ్డి, గౌతమ్, సురేశ్, అడెల్లు, కనక ప్రతిభ ఉన్నారు.

ఇంటి పత్రాలు మిస్సింగ్

తలమడుగు: అదిలాబాద్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నరంవార్ కవిత, ప్రభాకర్ చెందిన ఇంటి పత్రాలు శనివారం సుంకిడి గ్రామ సమీపంలో పడిపోయినట్లు బాధితురాలు నరంవార్ కవిత శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాలు ప్రకారం మహారాష్ట్రలోని కిన్వాట్ నుంచి ఆదిలాబాద్ పట్టణానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా సుంకిడి గ్రామంలోని జిరాక్స్ సెంటర్ వద్ద జిరాక్స్ తీసే సమయంలో పత్రాలు కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

బోథ్: మండల కేంద్రానికి చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ స్థానిక ఎంపీడీవో రమేశ్ చేతుల మీదుగా గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలంలో కార్మికులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

మహాయాగానికి తరలిరండి

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఈనెల 22 నుంచి నిర్వహించనున్న విశ్వశాంతి మహాయాగానికి తరలి రావాలని శ్రీకృష్ణ పీఠాధిపతి శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి పిలుపునిచ్చారు. శనివారం యాగానికి సంబంధించిన ఏర్పాట్లను భూమిపూజ చేసి ప్రారంభించారు.

ముగిసిన బోర్లకుంట జాతర

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని, పిప్పల్‌కోటి శివారులోని దవల్‌మాలిక్ బాబా బోర్లకుంట జాతర శనివారం ముగిసింది. గురువారం ప్రారంభమైన బోర్లకుంట జాతర మూడు రోజులుగా కొనసాగుతోంది. చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు హాజరై దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కిచిడి, మలిదా ప్రసాదాలను తయారుచేసి నైవేద్యంగా సమర్పించారు. నిపాని దర్గా నుంచి చాధర్‌ను తీసుకువచ్చి సమర్పించారు. తాంసి, తలమడుగు, జైనథ్‌తో, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో నిపాని మాజీ సర్పంచ్


పూజలు చేస్తున్న భక్తులు

రాజన్న, దర్గా కమిటీ సభ్యులు ఇర్ఫాన్, నాయకులు అఫ్రోజ్, సంతోశ్, గంగయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

బోథ్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని నిగిని గ్రామపంచాయతీ పరిధిలోని కై లాస్ టెకిడి నర్మదేశ్వర ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్మదేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. లింబాజీ మహరాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. చరిత్ర కలిగిన కైలాష్ టెకిడిలో గల నర్మదేశ్వరుడిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం నాయకులతో కలిసి ప్రసాదం స్వీకరించారు.

ప్రణాళికాబద్ధంగా విగ్రహాల ఏర్పాటు..

ఇచ్చోడ: మండల కేంద్రంలో చేపడుతున్న డబుల్ రోడ్డు పనులు పూర్తయిన తరువాత మహాత్ముల విగ్రహాలను ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేసుకుందామని, విగ్రహాల ఏర్పాటులో అన్ని కుల సంఘాలు సహకరించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో కులసంఘాలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ప్రసుతం ఉన్న శివాజీ, బాబుజగ్జీవన్ రాం విగ్రహాలను తొలగించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తారని అందుకు సహకరించాలన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఎంపీడీవో లక్ష్మణ్, ఆర్అండ్‌బీ ఏఈ అరవింద్, పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఏనుగు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

బజార్‌హత్నూర్: మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి లక్కం రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం గ్రామానికి చేరుకుని రాములు కుమారుడు లక్కం శ్రీనివాస్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో దగ్గరి బుచ్చవ్వ మృతిచెందారు. వారి కుటుంబసభ్యులు దగ్గరి రాములు, దత్తు, పండరిలను పరిమర్శించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం సైతం రూ. లక్షల కోట్ల అప్పులు చేస్తోందని మండిపడ్డారు. ప్రతీ పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కేవలం వరి పంటకు మాత్రమే బోనస్ ఇచ్చి మిగిలిన పంటలను విస్మరించారని విమర్శించారు. పంట బీమా ప్రీమియం సైతం కట్టడం లేదన్నారు. రైతు భరోసా పేరిట ఎకరానికి రూ. 15,000 ఇస్తామని చెప్పి, ఇంకా ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు వేణుగోపాల్, ఆకుల ప్రవీణ్, జోగు రవి, మయూర్ చంద్ర, విజయ్, జ్యోతి, రఘుపతి, దినేష్ మలోలియా, గంగారెడ్డి, నగేశ్, అశోక్ రెడ్డి, శ్రీనివాస్, కృష్ణ యాదవ్, రాకేశ్ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

‘చలో ఇంద్రవెల్లి’ విజయవంతం చేయండి

ఇచ్చోడ: చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఈనెల 9న ఇంద్రవెల్లిలో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు కొడ ప నగేశ్ కోరారు. శనివారం మేడిగూడ రాయిసెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొ లగించే వరకు ఉద్యమం చేస్తామన్నారు. ఆది వాసీల ఈసభకు అధిక సంఖ్యలో తరలిరావా లన్నారు. సమావేశంలో సార్మేడి మెస్రం శంభు, నైతం శేఖర్, ఆత్రం మహేందర్, మాడావి భీంరావు సంగెం రమేశ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 9న ఆదివాసీ తొమ్మిది తెగల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చదలో ఇంద్రవెల్లి కార్యక్రమానికి ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొడప సొనేరావ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనం ఆవరణలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగంలో


మాట్లాడుతున్న కొడప నగేశ్

పొందుపరిచిన ఆదివాసీ చట్టాలు, హక్కులు, జీవోలన్నింటిని కాలరాస్తున్నాయని మండిపడ్డారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలపై చేస్తున్న దాడులను తిప్పికొట్టాలన్నారు. ఇంద్రవెల్లిలో నిర్వహించే సభకు కొలాం తెగకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టేకం లక్ష్మణ్, టేకం గణేష్, మడావి జంగు, టేకం ముత్త, మడావి బాలు, జలపతి రావ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

తలమడుగు: పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని మండల ప్రత్యేకాధికారి, మార్కెటింగ్ శాఖ అధికారి గజానన్ అన్నారు. శనివారం మండలంలోని లింగి గ్రామంలో జెడ్పీఎస్ఎస్ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాన్నారు. జెడ్పీఎచ్ఎస్ఎస్ పాఠశాలలో కోడిగుడ్లు అందిస్తున్నారా? అడుగగా సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు తెలిపారు. తప్పనిసరిగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు గత ఆరు నెలలుగా మధ్యాహ్న భోజనం బిల్లు రావడంలేదని, మధ్యాహ్న భోజనం బిల్లులు రాక ఇబ్బంది అవుతుందని నిర్వాహకులు అధికారులకు విన్నవించారు. బిల్లులు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి గజానన్

బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

ఇచ్చోడ: ఆర్టీసీ బస్టాండ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారుతో మాట్లాడారు. బస్టాండ్‌కు కలర్స్, మరుగుదొడ్లు, మూత్రశాలలకు మరమ్మతులు చేయాలన్నారు. మరమ్మతుల కోసం రూ. 3 లక్షలు నిధులు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన స్థలం ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల గుండె పోటుతో మరణించిన సందీప్ కుటుంబాన్ని పరామర్శించారు.


అధికారులుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899